క్లుప్తంగా

సీఎండీఎస్ కిట్ల పంపిణీ

రాపూరు: మండలంలోని వేపినాపి గ్రామంలో మంగళవారం పొలంపిలుస్తుంది కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం రైతులకు సీఎండీఎస్ కిట్లను అందించారు.

వెంకటగిరి రూరల్: మండల పరిధిలోని వర్దనపల్లి, టీపీ కండ్రిగ, విశ్వనాధపురం, పంజాం, పాశెంకోట, నీలకంఠాపురం, మొగళ్లగుంట గ్రామాల్లో గిరిజన రైతులకు ఏపీసీఎన్ఎఫ్ సహకారంతో పీఎండిఎస్ కిట్లు మంగళవారం పంపిణీ చేశారు.

జీలుగ విత్తనాల పంపిణీ

సాక్షి ఎఫెక్ట్..

కోట: జీలుగ విత్తనాల కోసం రైతుల ప్రదక్షిణలు అనే శీర్షికన సాక్షి పత్రికలో వచ్చిన కథనానికి అధికారులు స్పందించారు. మంగళవారం రుద్రవరంలో వ్యవసాయశాఖ అధికారులు రైతులకు జీలుగ విత్తనాలు పంపిణీ చేశారు. రైతులతో మాట్లాడి వారికి కావాల్సినన్ని జీలుగ విత్తనాఉల అందజేశామని వ్యవసాయశాఖ అధికారి సుచేంద్రప్రసాద్ తెలిపారు.

ఇసుక లారీ పట్టివేత



పట్టుబడిన ఇసుక లారీ

పెళ్లకూరు : నాయుడుపేట-పూతలపట్టు జాతీయ రహదారిలో టెంకాయతోపు గ్రామ సమీపాన ఇసుక అక్రమంగా తరలిస్తున్న లారీని మంగళవారం విజిలెన్స్ అధికారులు పట్టుకున్నారు. గూడలి సమీపంలోని స్వర్ణముఖినది నుంచి బిల్లులు లేకుండా తిరుపతికి ఇసుక అక్రమంగా తరలిస్తుండగా విజిలెన్స్ అధికారులు దాడులు చేసి పట్టుకున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి పట్టుబడిన లారీని పోలీసులకు అప్పగించారు.

పన్ను చెల్లించకపోతే వాటర్ కట్



లోతువానిగుంట కాలనీలో స్థానికులతో మాట్లాడుతున్న కమిషనర్ ఫజులుల్లా

నాయుడుపేటటౌన్: పన్నులు సకాలంలో చెల్లించి మున్సిపాలిటీ అభివృద్ధికి సహకరించాలని కమిషనర్ షేక్ ఫజులుల్లా కోరారు. పట్టణంలోని పలు ప్రాంతాల్లో మంగళవారం కమిషనర్ సచివాలయ ఉద్యోగులతో కలిసి ఇంటింటికీ వెళ్లి ఇంటి పన్నులు సకాలంలో చెల్లిస్తున్నారా లేదా అనే విషయాలను పరిశీలించారు. ఏళ్ల తరబడి పన్నులు చెల్లించని వారని గుర్తించారు. పన్నులు చెల్లించకపోతే ఇంటి వాటర్ కనెక్షన్లను తొలగిస్తామన్నారు. దీంతోపాటు మున్సిపాలిటీలకు సంబంధించి సేవలు కూడా నిలిపి వేస్తామని హెచ్చరించారు. ఆయా ప్రాంతాల్లో నెలకొన్న డ్రైనేజీ, కాలువలు, తదితర సమస్యలను సైతం స్థానికులు అడిగి తెలుసుకున్నారు. సమస్యలు సైతం సత్వరం పరిష్కరించేలా చర్యలు చేపడతామన్నారు.

వైద్యురాలికి సన్మానం



సరస్వతిని సన్మానిస్తున్న వైద్యబృందం

రాపూరు: స్థానిక ప్రభుత్వ వైద్యశాలలో డిప్యూటీ సివిల్ సర్జన్‌గా పనిచేస్తున్న సరస్వతి ఉద్యోగోన్నతిపై సివిల్‌సర్జన్‌గా పశ్చిమ గోదావరి జిల్లా నరసాపూర్ ప్రభుత్వ వైద్యశాలకు బదిలీ అయ్యారు. దీంతో ఆమెను స్థానిక ప్రభుత్వ వైద్యశాలలో మంగళవారం డీసీహెచ్ఎస్ ప్రవళిక, వైద్యసిబ్బంది, గ్రామస్తులు ఘనంగా సన్మానించి ఆమె సేవలను కొనియాడారు.

దివ్యాంగులకు వైద్య పరీక్షలు



నాయుడుపేటటౌన్: దివ్యాంగులైన విద్యార్థులు విద్యనభ్యసించేందుకు ప్రత్యేక వసతులను కల్పిస్తున్నట్లు సమగ్ర శిక్ష జిల్లా ప్రాజెక్టు డైరెక్టర్ గౌరీ శంకర్‌రావు పేర్కొన్నారు. పట్టణంలో జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో మంగళవారం నియోజకవర్గ పరధిలోని సూళ్లూరుపేట, నాయుడుపేట, దొరవారిసత్రం, పెళ్లకూరు, ఓజిలి, తడ మండలాలకు సంబంధించి దివ్యాంగ విద్యార్థుకు ప్రత్యేక వైద్య శిబిరం నిర్వహించి వైద్య పరీక్షలు చేశారు.

చికెన్ ధరలు 10-09-2025

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు

బ్రాయిలర్ లైవ్	:	130
లేయర్ లైవ్	:	123
బ్రాయిలర్ చికెన్	:	234
బ్రాయిలర్ స్కిన్ లెస్	:	258
లేయర్ చికెన్	:	210



గూడూరు: సబ్ కలెక్టర్‌కు వినతి పత్రం అందిస్తున్న నేదురుమల్లి, మేరిగ మురళీధర్, రైతులు, వైఎస్సార్‌సీపీ నాయకులు





సూళ్లూరుపేట: కిలివేటి సంజీవయ్య, రైతులు, పార్టీ శ్రేణులను అడ్డుకుంటున్న పోలీసులు, ఆర్డీఓ కార్యాలయం ఏఓ కే రవికుమార్‌కు వినతిపత్రాన్ని అందజేస్తున్న సంజీవయ్య, పార్టీ నేతలు

అన్నదాత పోరుకు అడ్డంకులు

- ర్యాలీకి అనుమతి లేదన్న పోలీసులు
- వినతి పత్రం ఇవ్వడానికి పది మందే వెళ్లాలంటూ షరతులు
- 'బ్లాక్ మార్కెట్' సర్కారుకు బుద్ధి చెబుదాం
- నియోజకవర్గ సమన్వయకర్త కిలివేటి సంజీవయ్య



సూళ్లూరుపేట: ఆర్డీవో కార్యాలయం ఎదుట ప్లకార్డులతో నిరసన తెలుపుతున్న రైతులు

సూళ్లూరుపేట : రైతులకు మద్దతుగా నియోజకవర్గంలో వైఎస్సార్‌సీపీ చేపట్టిన అన్నదాత పోరుకు పోలీసులు అడుగడుగునా అడ్డంకులు సృష్టించారు. ముందుగా బస్టాండ్ సెంటర్‌లోని వైఎస్ రాజశేఖర్ రెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అక్కడి నుంచి ఆర్డీవో కార్యాలయం వరకు ర్యాలీగా బయల్దేరగా పోలీసులు అడ్డుకున్నారు. ర్యాలీకి అనుమతి లేదు.. ధర్నా చేసుకోండి అని చెప్పారు. దీంతో సంజీవయ్య కనీసం హోలీ క్రాస్ సర్కిల్ నుంచైనా అనుమతి ఇవ్వండి అని అడిగినా పోలీసులు ససేమిరా అన్నారు. అంతటితో ఆగకుండా పోలీసులు అన్నదాత పోరు ఫ్లెక్సీలను కూడా చించేశారు. దీంతో పార్టీ నాయకులు కార్యకర్తలు, అభిమానులు, రైతులు, ప్రజలందరూ కదం తొక్కి భారీ ర్యాలీగా వెళ్లి ఆర్డీవో కార్యాలయం వద్దకు చేరుకున్నారు. రైతులు పట్ల ప్రభుత్వం అనుసరిస్తున్న తీరుకి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ పెద్ద ఎత్తున ధర్నా చేశారు. ఆ తరువాత ఆర్డీవోకి వినతి పత్రాన్ని సమర్పించేందుకు కేవలం పది మందికి మాత్రమే అనుమతినిచ్చారు. ఆర్డీవో కార్యాలయం ఏఓ కే రవికుమార్‌కి వినతిపత్రాన్ని సమర్పించారు.

అనంతరం ఆర్డీవో కార్యాలయం వద్ద సూళ్లూరుపేట వైఎస్సార్‌సీపీ కన్వీనర్ కిలివేటి సంజీవయ్య మాట్లాడుతూ, రైతులు కడుపులు కొట్టి ఎరువులను బ్లాక్ మార్కెట్‌కు తరలిస్తూ, పోలీసులను అడ్డంగా పెట్టుకుని అరాచక పాలన సాగిస్తున్న ఈ ప్రభుత్వానికి తగిన రీతిలో బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. రాష్ట్ర వ్యాప్తంగా ఎరువులను బ్లాక్‌మార్కెట్‌కి తరలించి అమ్మేసుకుంటున్నారని చెప్పారు. ఈ కూటమి ప్రభుత్వం పోలీసులను అడ్డం పెట్టుకుని రైతులను అడ్డుకోవడం సిగ్గుచేటు అని దుయ్య బట్టారు. యూరియా సహా రైతులకు అవసరమైన ఎరువులను వెంటనే పంపిణీ చేయాలని కూటమి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పంటలకు గిట్టుబాటు ధరలు కల్పించడంతో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేసిన ఉచిత పంటల బీమాను పునరుద్ధరించాలని, ఇది అందరికీ వర్తింపజేయాలని డిమాండ్ చేశారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ప్రవేశపెట్టిన రైతు భరోసా కేంద్రాలను నిర్వీర్యం చేసి రైతులను రోడ్డుపాలు చేయడం అన్యాయమన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి కామిరెడ్డి సత్యనారాయణరెడ్డి, జిల్లా పార్టీ ఉపాధ్యక్షులు తంబిరెడ్డి సుబ్రమణ్యంరెడ్డి, నాయుడుపేట మున్సిపల్ చైర్మన్ కటకం దీపిక, ఆరు మండలాల పార్టీ అధ్యక్షులు అల్లూరు అనిల్‌కుమార్‌రెడ్డి, కొళివి అర్ముగం, అల్లూరు రాహుల్‌రెడ్డి, ఒట్టూరు కిషోర్‌యాదవ్, ఒబ్బు వెంకటరత్నం, నాయుడుపేట, సూళ్లూరుపేట పట్టణపార్టీ అధ్యక్షులు కలికి మాధవరెడ్డి, వేళ్లపాళెం కృపాకర్ రెడ్డి, నాయుడుపేట ఎంపీపీ కురుగొండ ధనలక్ష్మీ, సూళ్లూరుపేట మున్సిపల్ వైస్ చైర్మన్ పోలూరు పద్మ మిల్టన్, రత్నశ్రీ, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు మద్దాలి సోమశేఖర్‌రెడ్డి, దేశిరెడ్డి మధుసూదన్‌రెడ్డి, కట్లా భవాని శంకర్‌రెడ్డి, ఓజిలి ఎంపీపీ గద్దం అరుణారెడ్డి, పెళ్లకూరు ఎంపీపీ శేఖర్‌రెడ్డి, పెళ్లకూరు జెడ్పీటీసీ సన్నం ప్రిస్కిల్లా, జెటి వేణుయాదవ్, చిన్ని సత్యనారాయణ, అలవల సురేష్, కాకి శ్రీరామ్మూర్తి, మీజూరు రామకృష్ణారెడ్డి, తుపాకులు ప్రసాద్‌లతో పాటు వైఎస్సార్‌సీపీ సర్పంచులు, జెడ్పీటీసీలు ఎంపీటీసీలు, రైతులు పాల్గొన్నారు.

ప్రశ్నిస్తే ఉలుకెందుకు?

చిల్లకూరు: కూటమి ప్రభుత్వ పాలనలో నెలకొంటున్న సమస్యలపై ప్రశ్నిస్తే కూటమి పెద్దలకు ఉలుకెందుకో అర్థం కావడం లేదని వెంకటగిరి నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి ఎద్దేవా చేశారు. గూడూరులో మంగళవారం వెంకటగిరి, గూడూరు నియోజకవర్గాలకు చెందిన రైతులు, వైఎస్సార్‌సీపీ నాయకులు కలిసి అన్నదాత పోరు కార్యక్రమాన్ని నిర్వహించారు. దీనికి అనుమతులు కోరినా పోలీసులు పట్టించుకోకపోవడంతో గూడూరులోని వైఎస్సార్‌సీపీ కార్యాలయం నుంచి స్థానిక సంస్థల ఎమ్మెల్సీ మేరిగ మురళీధర్ ఆధ్వర్యంలో రైతులు, నాయకులు బయలుదేరారు. అయితే పోలీసులు అక్కడికి చేరుకుని అడ్డుకున్నారు. దీంతో రైతులు, నాయకులు ఎవరికి వారుగా అక్కడి నుంచి టవర్ క్లాక్ వద్దకు చేరుకున్నారు. అక్కడి నుంచి సబ్ కలెక్టర్ కార్యాలయం వద్ద నిర్వహించనున్న నిరసన కార్యక్రమంలో పాల్గొనేందుకు ప్రయత్నించారు. దీన్ని కూడా పోలీసులు భగ్నం చేయడంతో అందరూ గూడూరు సబ్ కలెక్టర్ కార్యాలయం వద్దకు చేరుకుని అక్కడ నిరసన వ్యక్తం చేశారు. అనంతరం సబ్ కలెక్టర్‌కు వినతి పత్రం ఇచ్చేందుకు వెళ్లడంతో ఆయన అక్కడ లేరు. దీంతో వినతి పత్రాన్ని కార్యాలయ ఏఓకు అందించారు. ఈలోగా సబ్ కలెక్టర్ కార్యాలయానికి రావడంతో ఆయన్ను కలిసి వినతి పత్రం అందించి రైతులు పడుతున్న ఇబ్బందులను తెలియజేశారు. సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకుని వెళతామని సబ్ కలెక్టర్ తెలిపారు.

గతంలో ఇంటి వద్దకే ఎరువులు

గత వైఎస్సార్‌సీపీ హయాంలో ఇంటి ముంగిటకు ఎరువులు, సబ్సిడీ పరికరాలు అందించారని నేదురుమల్లి రామ్ కుమార్‌రెడ్డి, స్థానిక సంస్థల ఎమ్మెల్సీ మేరిగ మురళీధర్ తెలిపారు. నేడు రాష్ట్రంలో ఎక్కడ చూసినా కి.మీ. మేర పొడువున క్యూలు కట్టాల్సిన దుస్థితి ఏర్పడిందన్నారు. ఈ కార్యక్రమంలో గూడూరు, చిల్లకూరు, చిట్టమూరు, కోట, వాకాడు మండలాల పార్టీ కన్వీనర్లు బొమ్మిడి శ్రీనివాసులు, మలుల విజయకుమార్‌రెడ్డి, యద్దల మధుసూదన్‌రెడ్డి, సన్నారెడ్డి శ్రీనివాసులరెడ్డి, పలగాటి సపంత్‌కుమార్‌రెడ్డి, ఏనుగు సుధాకర్‌నాయుడు, వెంకటగిరి, బాలాయపల్లి, డక్కిలి, రాపూరు, కలువాయి, సైదాపురం మండలాల కన్వీనర్లు, పులి ప్రసాద్‌రెడ్డి, కే శ్రీనివాసులరెడ్డి, కార్తీక్‌రెడ్డి, శ్రీనివాసులరెడ్డి, వెంకటక్రిష్ణారెడ్డి, రవికుమార్ యాదవ్, కలువాయి జెడ్పీటీసీ అనీల్‌కుమార్‌రెడ్డితోపాటు రైతులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.



సైదాపురం : గూడూరు సబ్‌కలెక్టర్ కార్యాలయం వద్ద రైతులను అడ్డగిస్తున్న పోలీసులు

మట్టి నమూనాలపై అవగాహన



దొరవారిసత్రం: మండల కేంద్రంలోని బీసీ గురుకుల కళాశాల, మావిళ్లపాడు ఆదర్శపాఠశాలలో విద్యార్థులకు స్కూల్ సాయిల్ హెల్త్ ప్రోగ్రామ్ కింద స్థానిక వ్యవసాయాధికారులు మట్టి నమూనాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఇన్‌చార్జి ఏడీఏ శ్రీనివాసచక్రవర్తి, ఏఓలు కళ్యాణ్ బాబు, పుష్పాంజలి పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన అవసరం

నాయుడుపేటటౌన్ : మహిళలు, యువతుల రక్షణ చట్టాలపై ప్రతి ఒక్కరికీ అవగాహన అవసరమని ఐసీడీఎస్ ప్రాజెక్టు జిల్లా డైరెక్టర్ వసంత బాయి సూచించారు. మండల పరిధిలోని బిరదవాడ గ్రామ సమీపంలో ఉన్న పుదూరు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ బాలికల గురుకులంలో మంగళవారం మిషన్ సంకల్పలో భాగంగా విద్యార్థినులకు అవగాహన కల్పించారు.

20న జెండా మహోత్సవం

కోట: మండలంలోని వెంకన్నపాళెంలో ఈ నెల 20, 21 తేదీల్లో ఆంజనేయస్వామి జెండా మహోత్సవాన్ని నిర్వహించనున్నట్లు ఆంజనేయస్వామి భక్తబృందం సభ్యులు మంగళవారం తెలిపారు.

అధినేతతో భేటీ



గూడూరురూరల్ : మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్.జగన్ మోహన్‌రెడ్డి తాడేపల్లిలో మంగళవారం పట్టణానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకులు ఇసళ్ల సురేష్ యాదవ్, మహిళా నాయకులు కార్ల దీప్తి, శానం పూడి సుజనారెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ మేరకు అధినేత వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి గూడూరు పట్టణ వైఎస్సార్‌సీపీ నాయకులను శాలువాతో సత్కరించారు. పార్టీ పరిస్థితి, ప్రజా సమస్యలపై చర్చించినట్లు తెలిపారు.

స్కూల్ గేమ్స్ ప్రారంభం

వెంకటగిరి రూరల్: మండల స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ ఆధ్వర్యంలో మండల స్థాయి క్రీడా పోటీలను నిర్వహించనున్నట్లు ఎంఈఓ-1 ఎన్ కొండయ్య, ఎంఈఓ-2 సి బాబయ్య పేర్కొన్నారు. వారు మాట్లాడుతూ అండర్ 14, 17 విభాగంలో బాలబాలికలకు క్రీడా పోటీలు ఈ నెల 15 నుంచి 17వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు తెలిపారు. అథ్లెటిక్స్, ఖోఖో, కబడ్డీ, వాలీబాల్, బ్యాడ్మింటన్, చెస్, యోగా పోటీలు ఉంటాయని తెలిపారు. ఈ పోటీలను మండల కో-ఆర్డినేటర్ విభాగ్యసేన పర్యవేక్షించనున్నట్లు తెలియజేశారు. ఆసక్తి కలిగిన వారు దరఖాస్తు చేసుకోవాలని తెలియజేశారు.

ఎయిడ్స్‌పై అవగాహన

దొరవారిసత్రం: మండల కేంద్రంలోని కేజీబీవీ పాఠశాలలోని బాలికలకు సోమవారం జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఆదేశాల మేరకు నవజీవన్ ఆర్గనైజేషన్ స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో ఎయిడ్స్, హెచ్ఐవీలపై అవగాన కల్పించారు. ప్రాజెక్ట్ మేనేజర్ బాలాజీ మాట్లాడుతూ ఎయిడ్స్, హెచ్ఐవీ లక్షణాలు వివరించారు. అనంతరం కృష్ణాపురం ఎస్టీ కాలనీలో ర్యాలీ నిర్వహించారు.

నిధుల స్వాహాపై ఫిర్యాదు

పెళ్లకూరు: పంచాయతీ అభివృద్ధికి 2021 నుంచి వచ్చిన నిధులన్నీ షాడో సర్పంచ్ మురళీకృష్ణారెడ్డి దుర్వినియోగం చేశారని మంగళవారం శిరసనంబేడు గ్రామస్తులు స్థానిక ఎంపీడీవో ప్రమీలారాణికి ఫిర్యాదు చేశారు. పనులు చేపట్టకుండా ఎంబుక్‌లు చేసుకొని నిధులు స్వాహా చేసినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. నాలుగేళ్లగా మంచినీటి కోసం దళితులు, గిరిజనులు అవస్థలు పడుతున్నట్లు వివరించారు.

వైఎస్సార్ సీపీలో మహిళలకు సముచిత స్థానం



వైఎస్సార్‌సీపీ కండువా కప్పుకున్న రేష్మాతో నేదురుమల్లి, మేరిగ, పార్టీ నాయకులు

చిల్లకూరు : వైఎస్సార్‌సీపీలో మహిళలకు సముచిత స్థానం ఉంటుందని స్థానిక సంస్థల ఎమ్మెల్సీ మేరిగ మురళీధర్, వెంకటగిరి నియోజకవర్గ సమన్వయకర్త నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి అన్నారు. కోట పట్టణంలోని టీడీపీకి చెందిన షేక్ రేష్మాతోపాటుగా మరి కొందరు మహిళలు మంగళవారం గూడూరులోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో కోట మండల వైఎస్సార్‌సీపీ కన్వీనర్ పలగాటి సంపత్‌కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో పార్టీ కండువా కప్పుకున్నారు. మేరిగ మురళీధర్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం మహిళలకు ఇచ్చిన పలు హామీలను గాలికి వదిలేసిందన్నారు. అనంతరం రేష్మా మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ బలోపేతానికి కృషి చేస్తామని అన్నారు.

ఉపాధి పనుల్లో అలసత్వం వద్దు

చిల్లకూరు: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద చేపట్టే ప్రతి పనిలో కూడా ఎక్కడ అలసత్వం పాటించ వద్దని ఎంపీడీఓ గోపి సూచించారు. మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం జిల్లా పీడీతో వెబ్ కాన్ఫరెన్స్ మాట్లాడిన అనంతరం ఆయన ఉపాధి సిబ్బందితో సమీక్షించారు. ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి పనులు చేపట్టే సమయంలో పంచాయతీలో తీర్మానాలు చేయాలన్నారు. ఏపీఓ గిరిబాబు ఉన్నారు.

గర్భిణులకు పౌష్టికాహారం

గూడూరురూరల్: గూడూరు ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి ప్రాంగణంలో మంగళవారం జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో గర్భిణులకు పౌష్టికాహారాన్ని పంపిణీ చేశారు. ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ షరీనా, బాలకృష్ణంరాజు చేతుల మీదుగా గర్భిణులకు వెజిటబుల్ రైస్, గుడ్లు, అరటిపండ్లను అందజేశారు.

ఆర్మేనిపాడు ఎంపీటీసీ హఠాన్మరణం



రఘురామరాజు (ఫైల్)



రఘురామరాజు కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న నేదురుమల్లి, మాజీ ఎమ్మెల్యే సంజీవయ్య

ఓజిలి: మండలంలోని ఆర్మేనిపాడు గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు, ఆర్మేనిపాడు ఎంపీటీసీ సభ్యుడు గుంటమడుగు రఘురామరాజు (55) మంగళవారం హఠాన్మరణం పొందారు. గుడూరు పట్టణంలోని ఆయన నివాసంలో బంధువులతో సరదాగా గడిపిన రఘురామరాజు భోజనం అనంతరం నిద్రపోయాడు. ఉదయం నిద్ర లేవకపోవడంతో పరిశీలించడంతో గుండెపోటుతో మృతి చెందారని గుర్తించారు. ఎంపీటీసీ భౌతికకాయాన్ని స్వగ్రామానికి తీసుకొచ్చారు. తిరుపతి జిల్లా అధ్యక్షుడు నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య ఆయన పార్థివదేహానికి పూలమాల వేసి, నివాళులర్పించారు. వారి కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ అరుణారెడ్డి, జెడ్పీటీసీ సభ్యుడు రవీంద్రరాజు, మండల కన్వీనర్ హరనాథ్ రెడ్డి, నాయకులు దేశిరెడ్డి మధుసూదన్‌రెడ్డి, కే వెంకట సుబ్బరాజు, దామోదర్‌రాజు పలువురు అనుబంధ విభాగాల అధ్యక్షులు, సర్పంచ్, ఎంపీటీసీ, నాయకులు పాల్గొన్నారు.

అమ్మవారి రథం ట్రయల్ రన్

వెంకటగిరి రూరల్: పోలేరమ్మవారి జాతరలో భాగంగా బుధవారం అమ్మవారు పుట్టినిల్లయిన కుమ్మరింటి నుంచి జీనుగుల వారి వీధిలోని మెట్టినింట మండపం వద్దకు వెళ్లి కొలువు దీరనున్నారు. అక్కడ ప్రత్యేకంగా అలంకరించి అమ్మవారికి ఆలయానికి తీసుకొచ్చేందుకు అమ్మవారి రథాన్ని మంగళవారం గూడూరు డీఎస్పీ గీతాకుమారి, సీఐ ఏవీ రమణ, ఎస్ఐ ఏడుకొండల సమక్షంలో జీనుగుల వారి వీధి నుంచి అమ్మవారి ఆలయం వరకు ట్రయిల్ రన్ నిర్వహించారు. దీనికి పట్టణ పరిధిలోని యువత అధిక సంఖ్యలో పాల్గొని రథం లాగేందుకు పోటీ పడ్డారు.

తాకట్టు పెట్టిన భవనాలు సీజ్



బ్యాంక్ అధికారులు సీజ్ చేయాల్సిన భవనం

నాయుడుపేటటౌన్ : పట్టణంలోని పిచ్చిరెడ్డితోపు వీధిలో ఉన్న భవనాల సముదాయాన్ని బ్యాంకు అధికారులు కోర్టు ఉత్తర్వులతో సీజ్ చేసేందుకు మంగళవారం పోలీసులను వెంట బెట్టుకుని వచ్చారు. దీంతో భవనాల యాజమానులు వారిని అడ్డుకుని ఆందోళనకు దిగారు. భవనాల సముదాయానికి సంబంధించి పత్రాలను ఓ వ్యక్తి తాకట్టు పెట్టి రూ.2 కోట్లకు పైగా రుణాలు పొందినట్లు ఆవేదన వ్యక్తం చేశారు. తమ భవన సముదాయాన్ని విక్రయిస్తానని చెప్పి సుమారు రూ.60 లక్షలు మాత్రమే ఇచ్చినట్లు బాధితులు పోలీసులు ఎదుట వాపోయారు. దీంతో మనుబోలుకు చెందిన ఎస్‌బీఐ అధికారులు న్యాయస్థానాన్ని ఆశ్రయించడంతో పోలీసుల సమక్షంలో భవన సముదాయాన్ని సీజ్ చేసి చేసి బ్యాంక్ అధికారులకు అప్పగించాలని ఆదేశాలు ఇచ్చారు. స్థానిక సీఐ బాబీ ఎస్ఐ ఆదీలక్ష్మి, పీఎస్ఐ భాను ప్రసన్నా పోలీసులతో కలిసి బ్యాంక్ అధికారులు భవన సముదాయం వద్దకు వెళ్లారు. అక్కడ ఆందోళనకు దిగిన వారికి సీఐ నచ్చజెప్పి మీరు న్యాయస్థానాన్ని ఆశ్రయించి న్యాయం పొందాలని సూచించారు. ప్రస్తుతం కోర్టు ఉత్తర్వులు పాటించి సముదాయంలో ఉన్న భవనాలన్నీ రెండు రోజుల్లో ఖాళీ చేసి బ్యాంకు అధికారులకు అప్పగించాలని సీఐ సూచించారు. సముదాయంలో ఖాళీగా ఉన్న కొన్ని భవనాలను బ్యాంకు అధికారులు సీజ్ చేశారు.

పోలేరమ్మా.. క్షమించు తల్లీ!



రాజాల అనుచరుల వద్ద నుంచి తాంబూలం స్వీకరిస్తున్న అమ్మవారి సేవకులు



వాహనంలో ఘటం కుండలను ఎక్కిస్తున్న నిర్వాహకులు

- సంప్రదాయానికి తిలోదకాలు
- ఘటోత్సవంలో పొరపాట్లు
- రెండో చాటింపులోనే అపశ్రుతి

వెంకటగిరి(సైదాపురం): పోలేరమ్మ తల్లి జాతరను రాజకీయ వేదికగా మార్చేశారు.. పెత్తనం చెలాయించడమే లక్ష్యంగా కూటమి నేతలు పోటీ పడుతున్నారు. రాష్ట్ర పండుగకు చేపట్టాల్సిన ఏర్పాట్లను గాలికి వదిలేసి ఆధిపత్యం కోసం ఆరాటపడుతున్నారు. జాతర నాటికి పూర్తి స్థాయి ఏర్పాట్లు చేయలేదు. పట్టణంలో పండగ సందడి కనిపించడం లేదు. ఈ ఏడాది అమ్మవారి జాతరను నిర్వహించేందుకు తొలుత వెంకటగిరి రాజా ప్యాలెస్‌లో రాజావారి కుటుంబీకుల వద్ద జాతర అనుమతులకు అమ్మవారి సేవకులకు అందించనున్న తాంబూలం స్వీకరణ ఆరంభం నుంచి వివాదాలు, పొరపాట్లు ప్రారంభమయ్యాయి. రెడ్డి పెత్తనం మాకొద్దంటూ గతంలో ఎప్పుడూ లేని విధంగా రాజాల అనుచరుల నుంచి అమ్మవారి సేవకులు తాంబూలం స్వీకరించారు. ఆదేరోజు రాత్రి నిర్వహించాల్సిన అమ్మవారి తొలిచాటింపులో కాంపాళెంలోని కామక్షమ్మ గుడివద్ద ఆలయ అధికారులు, రెడ్డి పెత్తందారులు పూజలు చేస్తుండగా రాత్రి 12 గంటలకు ముందే పోలేరమ్మతల్లి చాటింపు నేడు అంటూ చాటింపు వేశారు. ఈ విషయం తెలుసుకున్న అధికారులతోపాటు, రెడ్డి పెత్తందారులు పూజను హఠాత్తుగా ముగించుకుని పనిసేవకుల వద్దకు పరుగులు తీశారు. మరుసటి బుధవారం రెండో చాటింపు ఈనెల 3వ తేదీన 12 గంటల లోపు వేయాల్సి ఉండగా, 12 దాటిన తరువాత సంప్రదాయాలకు విరుద్ధంగా వేశారు. ఆ చాటింపు సమయంలో యువత అధిక సంఖ్యలో మద్యం తాగి సేవలకు అడ్డు తగిలారు. ఈనెల 7వ తేదీన ఆదివారం జరిగిన ఘటోత్సవంలో సంప్రదాయలను తుంగలో తొక్కి ప్రత్యేక వాహనంలో ఘటం కుండలను ఉంచి ఊరేగింపునకు బయల్దేరారు. స్థానికులు అడ్డుకోవడంతో ఘటములను వాహనంలో నుంచి కిందికి దించి, కాలి నడకన కదిలారు. అమ్మవారికి బలిఇచ్చే దున్నపోతు విషయంలోనూ నిబంధలు పాటించకపోవడం గమనార్హం.